క్లుప్తంగా

వైభవంగా సత్యనారాయణ స్వామి కల్యాణం



సత్యనారాయణస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు: మాకనపాలెంలో కొలువుదీరిన అనంతలక్ష్మీ భూదేవీ సమేత సత్యనారాయణ స్వామి 71వ వార్షిక దివ్య తిరు కల్యాణం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీశుభకృత్ నామ సంవత్సరం పాల్గుణ శుద్ధ ఏకాదశి శుభ ముహూర్తంలో మద్దాల లాల్‌నాగేంద్ర, లక్ష్మీప్రసన్న దంపతులు కల్యాణకర్తలుగా పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని కమనీయంగా జరిపించారు. వేద పండితుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, కర్పూర పరిమళాలు, బాణసంచా కాల్పుల నడుమ స్వామి కల్యాణం ఆద్యంతం కనులపండువలా నిర్వహించారు. ముత్యాల తలంబ్రాలను స్వామి, అమ్మవార్లకు భక్తులు కానుకలుగా సమర్పించారు. ఉభయ దేవేరులతో కొలువుదీరిన స్వామిని శుక్రవారం రాత్రి గరుడ వాహనంపై ఊరేగిస్తూ గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం పలువురు భక్తులు స్వామి వారి వ్రతాలు ఆచరించారు. మొక్కులు, అభిషేకాలతో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీఆంజనేయ పుష్పక వాహనంపై స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తూ గ్రామోత్సవాన్ని వైభవంగా జరిపించారు.

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని అధిక సంఖ్యలో దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

పూర్ణాహుతితో ముగిసిన సప్తాహం

మామిడికుదురు: పెదపట్నంలంక బొక్కావారి పాలెంలో సీతాసమేత పట్టాభి రామాలయం వద్ద గత ఏడు రోజులుగా జరుగుతున్న అఖండ శ్రీరామ నామ సర్వనామ చతుర్థ సప్తాహం శనివారం పూర్ణాహుతితో ముగిసింది. కంచి లక్ష్మీనరసింహారావు–రమాదేవి దంపతులతో కలశోద్వాసన చేయించారు. గత నెల 25న సప్తాహం ప్రారంభమైంది. దీనిలో భాగంగా ఏడు రోజుల పాటు నిరంతరాయంగా శ్రీరామ నామ సర్వనామ కీర్తనలతో భజన నిర్వహించారు. దీంతో పాటు స్వామికి ప్రత్యేక పూజలు జరిపించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా మామిడిశెట్టి నాగభూషణం, లక్ష్మమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

వైభవంగా మోరిలో రథోత్సవం

సఖినేటిపల్లి: మోరిలో కొలువైన మహాలక్ష్మమ్మ, కనక మహాలక్ష్మమ్మ అమ్మవార్ల జాతర తీర్థ మహోత్సవాల్లో భాగంగా శనివారం మహాలక్ష్మమ్మ అమ్మవారి రథోత్సవం వైభవంగా జరిగింది. ముప్పర్తి ఇంటి పేరు గల కుటుంబ సభ్యుల ఆధ్వర్యాన భక్తులు ఈ రథోత్సవం నిర్వహించారు. రథాన్ని పలు రకాలు పుష్పాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. తొలుత ఆలయం వద్ద నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మంగళవాయిద్యాలతో రథం వద్దకు తోడ్కొని వచ్చారు. అమ్మవారిని రథంపై అధిరోహింపచేసిన అనంతరం భక్తులు రథాన్ని మోరి, మోరిపోడు ప్రధాన వీధుల్లో యాత్ర చేపట్టారు. యాత్రలో వివిధ రకాల రథ శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రథం వద్ద అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

హనుమత్, గజ వాహనాలపై ఊరేగిన శ్రీవారు



వేంకటేశ్వరస్వామిని హనుమత్ వాహనంపై ఊరేగిస్తున్న గోవిందమాలధారులు

రావులపాలెం: శ్రీ అలివేలు మంగా పద్మావతి ఆండాళ్ సహిత వేంకటేశ్వరస్వామి 14వ వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శనివారం స్వామికి లక్ష్మీవేంకటేశ్వర స్వామి హోమం వైభవంగా నిర్వహించారు. తొలుత బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామికి ఉదయాన్నే సుప్రభాత సేవ, సహస్ర నామార్చన నిర్వహించారు. అనంతరం స్వామిని హనుమత్ వాహనంపై గోవిందమాలధారులు పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం చూర్ణోత్సవం నిర్వహించారు. రాత్రికి స్వామికి గజవాహనోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఏర్పాట్లను దేవస్థాన పాలక మండలి చైర్మన్ పడాల పెదవెంకటరెడ్డి, ఇతర సభ్యులు పర్యవేక్షించారు.

నేను ఉన్నాను.. నేను విన్నాను..

- సీఎం హామీతో నెరవేరుతున్న సొంతింటి కల
- మూడు దశాబ్దాల కష్టాలకు ఇక విముక్తి



రాజోలు జగనన్న లేఅవుట్–2లో ప్రారంభమైన గృహనిర్మాణ పనులు



రాజోలు ఏటిగట్టు వాసుల గోడును ఆలకిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

రాజోలు: మూడు దశాబ్దాలుగా వరద కష్టాలు.. నష్టాలతో ఇబ్బందులు..ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల నీటిమూటల హామీలతో రాజోలు ఏటిగట్టు నివాసితులు విసుగు చెందారు. అయితే వారి సమస్యను నేరుగా చూసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీతో వారి సొంతింటి కల సాకారమైంది. గతేడాది జూలైలో వరద బాధితులను పరామర్శించేందుకు సీఎం జగన్ వచ్చారు. రాజోలు ఏటిగట్టు వాసులను పరామర్శించి ఏటిగట్టు నివాసితుల పూరిళ్ల దుస్థితిని స్వయంగా పరిశీలించారు. వారి కష్టాలను అడిగి తెలుసుకున్న ఆయన రాజోలులో జగనన్న లేఅవుట్–2లో 100 మందికి ఇళ్లు కట్టించేందుకు హామీ ఇవ్వడంతో వారి సొంత ఇంటి ఆశలు చిగురించాయి. సీఎం జగన్ ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. సీఎం జగన్ ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా రంగంలోకి దిగారు. రాజోలులో జగనన్న లేఅవుట్–2 కాలనీల్లో హుటాహుటిన రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సాయంతో కొంత లబ్ధిదారులు సొమ్ములు జోడించి పక్కా ఇంటి నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుక, ఐరన్, సిమెంట్‌ను లబ్ధిదారులకు అందించే విధంగా గృహనిర్మాణ అధికారులకు సూచించారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు, తాగునీటి పైప్‌లైన్లు ఏర్పాటు చేశారు. ఏటిగట్టుపై నివాసం ఉంటున్న సుమారు 100 మందికి సొంతింటి కల నెరవేరనుంది. ఇప్పటికే రాజోలు జగనన్న లేఅవుట్‌లో ఐదుగురు లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇంటి నిర్మాణం చేసుకునే లబ్ధిదారులకు ప్రభుత్వపరంగా సహకారం అందించేందుకు అధికారులు అన్ని మౌలిక సదుపాయలు ఏర్పాట్లు చేశారు.

జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆధ్వర్యంలో లబ్ధిదారులతో ఇటీవల అవగాహన సదస్సు నిర్వహించారు. లే అవుట్‌లో పర్యటించి రెవెన్యూ, గృహనిర్మాణ, ఇంజినీరింగ్, విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి వేగవంతంగా ఇంటి నిర్మాణం చేసేందుకు చర్యలు చేపట్టారు.

మా కష్టాలు చూసి సీఎం చలించారు



వరద సమయంలో సీఎం జగన్ మా కష్టాలను చూసి చలించారు. ఏ ముఖ్యమంత్రి మా ఏటిగట్టు వైపు చూడలేదు. సొంతగా ఇళ్లు నిర్మించుకోవడానికి ఆర్థిక స్తోమత లేదని ఆయనకు మొరపెట్టుకున్నాం. ఆయన ఇచ్చిన హామీతో ఇంటి పనులు ప్రారంభమయ్యాయి. చాలా సంతోషంగా ఉంది.

– అవనిగడ్డ రాంబాబు, లబ్ధిదారుడు, రాజోలు ఏటిగట్టు వాసి

సొంత ఇంటి కల నెరవేరుతుంది



సీఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీతో మూడు దశాబ్దాల సొంత ఇంటి కల నెరవేరుతుంది. ముప్పై ఏళ్లుగా మేము చెప్పులు అరిగేలా అందరి చుట్టూ తిరిగాం ఫలితం లేదు. సీఎం జగన్ మాటతో మాకు సొంత ఇల్లు సిద్ధమవుతుంది.

– చింతా వెంకటనారాయణ, లబ్ధిదారుడు, రాజోలు ఏటిగట్టు వాసి

మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశాం



రాజోలు జగనన్న లేఅవుట్–2లో గృహనిర్మాణ లబ్ధిదారులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశాం. జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆధ్వర్యంలో ఏటిగట్టు నివాసితులు సుమారు 100 మందికి పక్కా ఇంటి నిర్మాణం చేసేందుకు ప్రణాళిక రూపొందించాం. కొంత మంది లబ్ధిదారులు పనులు ప్రారంభించారు.

– బీఎం ముక్తేశ్వరరావు, తహసీల్దార్, రాజోలు

ప్రజలు మెచ్చిన నాయకుడు సీఎం జగన్



వీరవల్లిపాలెంలో గృహసారథులకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అయినవిల్లి: రాష్ట్రంలో ప్రజల మెచ్చిన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మరలా సీఎంగా ఆయనే అవుతారని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. శనివారం మండలంలోని వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, అయినవిల్లి, తొత్తరమూడి గ్రామాల్లో మార్చి 18న జరగబోయే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లకు, గృహ సారథులు, నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కరోనా వంటి విపత్తులు సీఎం వైఎస్ జగన్ ప్రజలకు అండగా నిలిచారన్నారు. మునుపెన్నడు లేని విధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మరలా సీఎం జగన్ సీఎంగా చూడలన్నదే తమ ధ్యేయమన్నారు. ప్రజల్లోకి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను తీసుకెళ్లాలన్నారు. ప్రతిపక్షాలు సీఎంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. తామరపువ్వు బురద నంటని రీతిలో రాజన్న రాజ్యం మరలా రాబోతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, బయ్యా చినబాబు, వేటుకూరి వెంకట్రాజు, నంబూరి వెంకటరమణరాజు, నంబూరి రాంబాబు, వారా జయసావిత్రి, బొంతు రాజేంద్ర ప్రసాద్, దాసరి శైలజ, గోడి హేమలత, దాసరి వీరాస్వామి, దామిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్'పై నేడు 3 గ్రామాల్లో అవగాహన

అంబాజీపేట: ఈ ఏడాది మార్చి 18 నుంచి చేపట్టే 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంపై మూడు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఆదివారం నిర్వహిస్తున్నట్లు జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్ తెలిపారు. వాకలగరువు, తొండవరం, నందంపూడి గ్రామాల్లో నిర్వహించే సమావేశానికి పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు హాజరు కావాలని సత్యమోహన్ కోరారు.

రూ.5 లక్షల బీమా చెక్కు అందజేత

ఆత్రేయపురం: మండలంలోని వెలిచేరు గ్రామానికి చెందిన యేడిద సత్యనారాయణ ఇటీవల ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. దీంతో మృతుని కుటుంబానికి జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ తరఫున నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా రూ.5 లక్షలు ప్రమాద బీమా చెక్కు అందించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ అంజిబాబు

మామిడికుదురు: నగరం ముస్లిం వీధి ఓఎన్జీసీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన నగరం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, మామిడికుదురు సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ శనివారం ప్రారంభించారు. జెడ్పీటీసీ అంజిబాబు, సర్పంచ్ మొహిద్దీన్ మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో యువకులు క్రీడలను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసంగంతో పాటు శారీరక దారుఢ్యం మెరుగుపడుతుందన్నారు. ఈ టోర్నీ విజేతలకు మొదటి బహుమతిగా రూ.11 వేలు నగదు, రెండో బహుమతిగా రూ.అయిదు వేలు ఇస్తామని నిర్వాహకులు జాఫర్ అబ్బాస్, జాఫర్ హుస్సేన్ తెలిపారు. వీటితో పాటు మ్యాన్ ఆఫ్ ది సిరీస్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్ అవార్డులు కూడా ఇస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు సజ్జాద్ హుస్సేన్, వైఎస్సార్ సీపీ నేతలు కొండేటి వికాస్ బాబు, కొండేటి స్టాలిన్‌బాబు, మండల కో–ఆప్షన్ సభ్యుడు నూర్జైన్ అబ్బాస్, సర్కిల్ ముస్తఫా, జానీరాజు, మొహిద్దీన్ రాజ్, జాలెం బాబి పాల్గొన్నారు.

'ఉన్నతి' బకాయిలు సత్వరమే వసూలు



ఆలమూరులో నిర్వహించిన సమావేశంలో ప్రసంగిస్తున్న డీపీఎం

ఆలమూరు: వైఎస్సార్ క్రాంతి పథంలో భాగంగా ఉన్నతి పథకం కింద మంజూరు చేసిన రుణాల బకాయిలను సత్వరమే వసూలు చేయాలని జిల్లా డీపీఎం ఎం.సామ్యూల్ అన్నారు. ఆలమూరులోని వైఎస్సార్ కేపీ భవనంలో మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు జి.ఉమాశ్రీ అధ్యక్షతన నిర్వహించిన యానిమేటర్లు, వీవోఏల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మండలంలోని 18 గ్రామాల పరిధిలో కేవలం ఐదు గ్రామాల్లో మాత్రమే రుణ సమీకరణ పూర్తిస్థాయిలో జరుగుతుందన్నారు. మిగిలిన గ్రామాల్లో రూ.39.96 బకాయి ఉందన్నారు. ఈ నెలాఖరు నాటికి బకాయిలు వసూలు చేయకపోతే సంబంధిత 31 మంది సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్హులైన డ్వాక్రా మహిళందరికీ రికార్డుస్థాయిలో రుణాలు మంజూరు చేయడంతో పాటు అనేక పథకాలను అందిస్తుందన్నారు. ప్రభుత్వం పేద మహిళల కోసం అమలు చేస్తున్న పథకాలపై యానిమేటర్లు ప్రజలకు వివరించాలని సూచించారు. ఏపీఎం ఎం.ధనరాజు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు కె.భీమరాజు, సీహెచ్ సుబ్బారావు, ఎంఎస్ కుమార్ పాల్గొన్నారు.

స్వామివారి సన్నిధిలో 'మంతెన'



అంతర్వేది ఆలయంలో చైర్మన్ వెంకట రామరాజు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శనివారం హైదరాబాద్ కేంద్రంగా ఉన్న వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయం వద్ద మర్యాదలతో అర్చకులు, ఆలయ సిబ్బంది స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆయనకు ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు ఆశీర్వచనాలు తెలిపారు. ఆయనకు అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ప్రసాదం, స్వామి చిత్రపటం అందజేశారు. వెంట రాజోలు ఫౌండేషన్ కన్వీనర్ జంపన బుజ్జిరాజు, ప్రతినిధులు బోణం రాజు, ఎ.మధురాజు, అటారం మాస్టారు పాల్గొన్నారు.

శివారు భూముల సాగునీటి సరఫరాకు చర్యలు



మాచవరంలో ఆయిల్‌కు రైతులకు నగదు అందిస్తున్న జేఈ సుందర్‌సింగ్

అంబాజీపేట: శివారు ప్రాంత పంట భూములు తడులు లేక ఇబ్బందులు పడుతున్న వరిచేలకు పూర్తి స్థాయిలో నీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నామని ఇరిగేషన్ డీఈ ఎ.వెంకటేశ్వరరావు అన్నారు. మాచవరం, ఇసుకపూడిలోని సాగునీరు అందని పంట భూములను శనివారం డీఈ వెంకటేశ్వరరావు, జేఈ డి.సుందర్‌సింగ్ పరిశీలించారు. శివారు ప్రాంత వరి చేలకు సాగునీరు అందక వరి చేలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేయడంతో గత నెల 23న అంబాజీపేట, ముంగండలో ఉన్న వరి చేలను కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి పరిశీలించి, సాగు నీరు అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఈ రెండు గ్రామాల్లో ఉన్న 100 ఎకరాలకు ఆయిల్ ఇంజిన్ ద్వారా తడులు పెట్టుకునేందుకు ఎకరానికి 5 లీటర్ల చొప్పున ఆయిల్‌ను రైతులకు పంపిణీ చేసినట్లు డీఈ, జేఈలు వివరించారు. 36 గంటల వంతుల వారీ విధానం వల్ల శివారు ప్రాంత భూములకు సాగు నీరు అందక వరి చేలు ఎండిపోతున్న కారణంగా వంతులవారీ విధానాన్ని 72 గంటలు ఇచ్చేలా ఆర్డీవో ఉన్నతాధికారులతో చర్చించారన్నారు. చిరతపూడి, ఇసుకపూడి, నరేంద్రపురం, మాచవరం, కుందాలపల్లి, పలివెల, అవిడి, దాకేరు ప్రాంతాలన్నింటికీ సాగు నీరు అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. శివారు ప్రాంత భూములకు సాగు నీరు అందనట్లయితే ఆయా ఆ ప్రాంతాలను పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామన్నారు. ఇరిగేషన్ సిబ్బంది ప్రసాద్, వీఆర్వో దొర పాల్గొన్నారు.

శనైశ్చరునికి భక్తుల తైలాభిషేకాలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) క్షేత్రానికి శనివారం ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. పౌర్ణమి ముందు శనిత్రయోదశి పర్వదినం పురస్కరించుకుని వివిధ రూపాల్లో టిక్కెట్ల ద్వారా రూ.4,13,878 ఆదాయం, అన్నప్రసాదం విరాళం రూపంలో రూ.12,777 వచ్చినట్టు దేవదాయ శాఖ ఏసీ, ఈఓ సింగం రాధ తెలిపారు.

ప్రమాదకర ప్రదేశంలో తూము ఏర్పాటు



ఆలమూరులో మార్కెట్ మలుపు వద్ద సిమెంట్ తూము ఏర్పాటు చేసిన పంచాయతీ సిబ్బంది

ఆలమూరు: స్థానిక కూరగాయల మార్కెట్ మలుపులో ప్రమాదభరితంగా ఉన్న ప్రదేశంలో గ్రామ పంచాయతీ భారీ సిమెంట్ తూము ఏర్పాటు చేసింది. వాహనాల రద్దీ ఎక్కువ కావడంతో మలుపు వద్ద ఉన్న బెర్మ్ కుంగిపోయింది. దీనిపై స్థానికుల ఫిర్యాదు మేరకు సర్పంచ్ నేలపూడి లావణ్య, కార్యదర్శి కె.సంజీవరెడ్డి, ఉప సర్పంచ్ చల్లా సీతామహాలక్ష్మి స్పందించారు. అందులో భాగంగా పంచాయతీ నిధులతో అప్పటికప్పుడు భారీ సిమెంట్ తూము తీసుకువచ్చి జేసీబీ సాయంతో అమర్చారు. అనంతరం బెర్మ్‌లను మీటరు పొడవు మేర పూడ్చి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. నాతి కుమార్ రాజా, వి.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

కొత్తపేట: సమాజంలో సగభాగం వున్న మహిళలకు రాజ్యాంగం కల్పించిన చట్టాలు, హక్కులు కాపాడుకుంటూ, ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవడం ద్వారా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్ మహిళలకు సూచించారు. ఈ నెల 8న ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకుని హైకోర్టు ఆదేశాల మేరకు వారం రోజుల పాటు జరిగే మహిళా వారోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా సాయంత్రం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సీనియర్ జడ్జి శ్రీధర్ అధ్యక్షతన మహిళా చైతన్య సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ మగపిల్లలనే కాదు ఆడపిల్లలను కూడా ఉన్నత చదువులు చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. కుటుంబంలో, సమాజంలో ఎదురయ్యే ప్రతి చిన్న విషయానికి కుంగిపోకుండా ధైర్యంగా నిలిచి ఎదుర్కోవాలని మహిళా లోకానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏజీపీ విజయ, సీనియర్ న్యాయవాదులు ప్రభాకరరావు, బాలప్రతాప్, సర్పంచ్ బూసి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాచుపాము హల్‌చల్

అయినవిల్లి: అయినవిల్లి పోలీస్‌స్టేషన్ వద్ద శనివారం రాత్రి తాచుపాము హల్‌చల్ చేసింది. ఈ సమయంలో మండలంలోని వివిధ గ్రామాల ఫిర్యాదుదారులు పెద్ద ఎత్తున తమ సమస్యల పరిష్కారం కోసం అయినవిల్లి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఇదే సమయంలో సమీప కొబ్బరితోట నుంచి తాచు పాము వచ్చింది. అక్కడున్న మహిళా, పురుష ఫిర్యాదుదారులు ఒక్క ఉదుటన ఆ పామును చూసి గంతేశారు. అందులో అయినవిల్లి గ్రామానికి చెందిన రాకాపు రమేష్ చొరవ చూపి ఆ పామును అక్కడే ఉన్న రాయితో కొట్టి చంపాడు. దీంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఖాతాదారులకు ఫైనాన్షియల్ లిటరసీ అవేర్‌నెస్ ప్రోగ్రాం



రామరాజులంకలో గ్రామీణ బ్యాంకు శాఖలో మాట్లాడుతున్న శివశంకర్‌ప్రసాద్

మలికిపురం: మండలంలోని రామరాజులంక చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు శాఖలో శనివారం బ్యాంకు అధికారులు ఖాతాదారులకు ఫైనాన్షియల్ లిటరసీ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శివశంకర్ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఖాతాదారులను చైతన్యపరిచే విధంగా సమగ్ర సమాచారాన్ని ఆయన వివరించారు. అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎం జిలానీ, డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్(బ్యాంకు లింకేజీ) అన్నపూర్ణ, ఏపీఎం వరాలబాబు, జీజీబీ రాజమహేంద్రవరం రీజినల్ మేనేజర్ పి.శ్రీనివాస్, ప్లానింగ్ హెచ్‌వోడీ రామారెడ్డి, బ్యాంకు బీఎం శివరామిరెడ్డి, పంచాయతీ ప్రెసిడెంట్ కాకర శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ మేడిచర్ల గంగరాజు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.40 వేల విరాళం



దాతలకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్‌పర్సన్ వీరీతాదేవి తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి పట్టణానికి చెందిన సత్య దేవ ఏజెన్సీస్ యజమానులు వేటుకూరి సుబ్బరాజు, కృష్ణంరాజు సోదరులు శనివారం రూ.40 వేల విరాళం అందించారు. ఈ మొత్తాన్ని ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవికి అందజేశారు. అనంతరం ఆ దాతలకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో దూనబోయిన సాయిబాబు, మున్సిపల్ కౌన్సిలర్ గొవ్వాల రాజేష్, పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు దూడల ఫణి, ఆలయ ధర్మకర్తలు నడింపల్లి వర్మ, ముంగర ప్రసాద్ పాల్గొన్నారు.

మీర్జా గులామ్ అబ్బాస్ కుటుంబ సభ్యులకు పరామర్శ

మామిడికుదురు: ఇరాక్‌లోని పవిత్ర కర్బలా పుణ్యక్షేత్రాల సందర్శనకు వెళ్లి అక్కడ మృతి చెందిన నగరం గ్రామానికి చెందిన డాక్టర్ మీర్జా గులామ్ అబ్బాస్ అలియాస్ అబ్బాస్ కుటుంబ సభ్యులను శనివారం కోనసీమ ఆర్‌ఎంపీలు, పీఎంపీల సంఘం పరామర్శించింది. కోనసీమ సంఘం అధ్యక్షుడు కంబాల బాబూరావు, ప్రధాన కార్యదర్శి ఎండీ రఫీ, రాజోలు, మామిడికుదురు మండలాల సంయుక్త అధ్యక్షుడు వై.త్రిమూర్తులు, ప్రధాన కార్యదర్శి ఎం.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు జోగి అప్పారావు, కోశాధికారి యేడిద రఘుప్రసాద్ తదితరులు గులామ్ అబ్బాస్ కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతిని తెలిపారు.


చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం

ఆలమూరు: గ్రామానికి చెందిన ముద్రగడ అరుణ కుమారి వైద్యం నిమిత్తం వైఎస్సార్ సీపీ నేతలు రూ.పది వేలు ఆర్థిక సాయం అందించారు. స్థానిక బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న ఆ బాలిక తీవ్ర అనారోగ్యానికి గురయ్యింది. దీంతో అరుణకుమారికి మెరుగైన వైద్యం కోసం రూ.మూడు లక్షల వరకూ ఖర్చవుతుందని హైదరాబాద్‌కు చెందిన వైద్యులు తెలిపారు. దీనిపై స్పందించిన పెదపళ్లకు చెందిన పీఏసీఎస్ అధ్యక్షుడు నెక్కంటి వెంకట్రాయుడు రూ.ఐదు వేలు, గుమ్మిలేరు సర్పంచ్ రూ.ఐదు వేలు నగదును ఆలమూరులోని ఆ బాలిక నివాసంలో అందజేశారు. సర్పంచ్ నేలపూడి లావణ్య, నాతికుమార్‌రాజా, వి.విజయ్ పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల గ్రామ సచివాలయాల పరిధిలో ఆరోగ్య సిబ్బంది శనివారం చిన్నారులకు టీకాలు అందజేశారు. వైద్యాధికారులు ఎం.సుమలత, పి.భవానీశంకర్ ఆధ్వర్యంలో ఆలమూరు–2, కలవచర్ల, పినపళ్ల, సందిపూడి, జొన్నాడ శివారు మూలాటి రేవు, చొప్పెల్ల, మోదుకూరు, నవాబుపేట, మడికి శివారు మల్లవానితోట, మూలస్థాన అగ్రహారం గ్రామాల్లో అనేక మంది చిన్నారులకు ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది టీకాలు వేశారు. కోవిడ్ నిబంధనలను అనుసరించి నిర్వహించిన ఈ టీకాల ప్రక్రియను సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి పర్యవేక్షించారు. చిన్నారులకు ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు పెంటావాలెంట్, ఎంఆర్, టీటీ, డీపీటీ, హెపటైటిస్–బీ వ్యాక్సిన్లను అందజేశారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్, మోటార్లు లేక రైతుల ఇబ్బందులు



లంక భూములను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఏఈ బాపిరాజు తదితరులు

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలిలో ఎస్సీ సొసైటీకి చెందిన లంక భూముల్లో విద్యుత్, మోటారు లేక రైతులు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారని జిల్లా ఎస్సీ సెల్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కప్పల శ్రీధర్ తెలిపారు. ఈ విషయంపై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సంబంధిత అధికారులు ట్రాన్స్‌కో ఏఈ లంక భూములను పరిశీలించారు.